**శ్రీ రమణ జ్యోతి** | **Sri Ramana Jyothi**
మార్చి 2020 | March 2020

ఈ సంచికలో ... | IN THIS ISSUE ...


1. **డా॥ కే.యస్. గారి 68వ ప్రవచనం** — డా॥ వి. రామదాస్ మూర్తి 3
2. **అనుస్మరణీయులు** — ఎన్. పాండు రంగారావు 9
3. **శ్రీరమణ మహర్షి సూక్తులు** — కమలాకర వెంకటరావు 12
4. **ఆరోపణ, నిరాకరణ** — డా॥ వి. రామదాస్ మూర్తి 16
5. **శ్రీ భగవాన్ సేవలో** — జి. శ్రీహరిరావు 22
6. Bhakti and Detachment — Dr.K. Subrahmanian 30
7. Aligning with Real Self — Muktananda 42
8. Kavyakantha's Chatvarimsat — V. Krithivasan 46
9. "I Don't Know" is a Good Place to Start From — Vimal Balasubrahmanyan 49


**Events in Sri Ramana Kendram in March 2020**

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 6th March - Punarvasu Satsang - 6.00 - 7.30 p.m.
4. 14th March (Every 2nd Saturday of the month) Uma Sahasram recitation from 12.00 noon - 5.00 p.m.

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# ఒత్తిడి, పూర్వాపరాలు

డా॥ కే.యస్. గారి 68వ ప్రవచనం
అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

## కలవరానికి కారణం

మనం ప్రేమాభిమానాలతో మాత్రమే ఎవరినైనా కలవడానికి వెళ్ళినప్పుడు ఎదుటివారి నుండి ఏమీ ఆశించం. అవతలివారు కూడ ఈ విషయాన్ని గ్రహిస్తే, సహృదయ వాతావరణం ఏర్పడుతుంది. రెండు పక్షాలూ ఆనందాన్ని అనుభవిస్తారు. సెలవు తీసుకుని వచ్చినప్పుడు, ఆ కలయిక ఫలవంతమైనట్లు తృప్తిని కలిగిస్తుంది. ఏ రకమైన మానసిక ఒత్తిడి కూడ చోటు చేసుకోదు. అదే, మనం ఏదైనా ఆశించి ఎవరినో కలవాలని, లేదా మాట్లాడాలని అనుకున్నామనుకోండి, ఆ సమయం కంటే ఎంతో ముందు నుంచి మనలో ఒక రకమైన కలవరం మొదలౌతుంది. ఏదో తెలియని ఒత్తిడికి గురి అవుతాం. అతడు ఎలాగ ప్రతిస్పందిస్తాడు? ఈ విషయమై కలవడం లేదా మాట్లాడడం నిజంగా సహాయపడుతుందా? లేదా, దానివల్ల ఏమైనా హాని కలుగవచ్చా? ఇలాగ సందిగ్ధమైన మనసుతో కలత చెందుతూ వుండగానే, ఆఖరుకు ఆ సమయం వస్తుంది. సంభాషణ మొదలైతే ఆ ఒత్తిడి ఇక వుండదు. ఇలా ప్రతిసారి జరుగుతూనే వుంటుంది. దానికి మన అసంతృప్తి, సంతోషంగా వుండకపోవడమే కారణం.

సాధారణంగా మనం ఇతరుల నుండి ఏదో ఆశించడం, లేదా కోరడం జరుగుతుంటుంది. దానితో ఒత్తిడి ఏర్పడుతూనే వుంటుంది.

దీనినంతటినీ, నిత్యజీవితంలో ఒక భాగంగానే పరిగణిస్తాం. ఇది ఒక్క మానవుల విషయాలకు మాత్రమే పరిమితం కాదు. దేవుని గురించి కూడ ఇలానే ప్రవర్తిస్తాం. ఏదో కావాలని కోరుకుంటాం. అలా ప్రార్థించడానికి ముందే కలవరం మొదలౌతుంది. మన ప్రార్థన సఫలమౌతుందా? ఒక్కొక్కసారి ఆశాజనకంగా వుంటుంది. అంతకు ముందు మనం ఆశించినది జరగలేదని జ్ఞాపకం వస్తే మళ్ళీ అదే ఒత్తిడి. అలా ప్రార్థించడం ఉపయోగంలేదని నిరుత్సాహపడవచ్చు. మరి కొన్ని సందర్భాలలో దేవుడన్నవాడు లేడని నిర్ధారణ చేసు కోవడం కూడ జరగవచ్చు. ఇంతమంది లోకంలో వుంటే నాకే ఎందుకు ఇలా కావాలి? ఇన్ని బాధలూ, కష్టాలూ నా ఒక్కడికే వస్తాయని అనుకుంటాం. కాని మరుక్షణంలో మళ్ళీ ఇది అర్థం లేని ఆలోచన, మనకు అతీతమైన శక్తి ఒకటి వుంది. ఆయనను ప్రార్థించాలి. లేదా ప్రార్థన ఎందుకు, అంతా ఆయనకే వదలిపెడదాము, అనుకుంటాం. మన మనసులో ఇలాంటి సంఘర్షణ అమితమైన బాధ, దుఃఖం వున్నప్పుడు ఏర్పడుతుంది.

దాదాపు ఏదైనా ఆశించిన ప్రతిసారీ, మనం నిరాశకు కూడ సిద్ధపడతాం. అరుదుగా తప్ప, ఏదో ఆశించకుండ, భగవంతుడిని కూడ తలచుకోవడం జరగదు. దానితో ఒత్తిడి పెరుగుతుంది. అప్పుడప్పుడు దుఃఖాలు, బాధలను గురించి చర్చిస్తూ, పలు పుస్తకాలు వున్నాయని గుర్తుకు వస్తుంది. కాని అవి కొంత వరకే సహాయపడతాయి. బాధ వుందని తెలియడానికి పుస్తకాలు అవసరం లేదు. బాధ నాకు వుండనే వుంది. ఆ బాధ నివారణకే ప్రయత్నాలు. ప్రతి ఒక్కరూ ఆ దిశలో తమ స్వంత పద్ధతులను ఉపయోగించి



చూస్తుంటాం. విషయమేమిటంటే ఏదైనా బాధ గురించిన దాని కంటే, ఆ బాధ ఇంకా ఎక్కువవుతుందా, అలా జరిగితే నా పరిస్థితి, నా కుటుంబ పరిస్థితి, ఎలాగుంటుందని తలచుకొని వచ్చే దుః ఖం మరింత ఎక్కువగా వుంటుంది. దానితో బాటు ఒత్తిడి కూడ పెరుగుతుంది.

### మారే కోరికలు

ప్రతి ఒక్కరూ సుఖంగా వుండడానికి ఇష్టపడతారు. దానికి వేరు వేరు మార్గాలను వెతుక్కుంటాం. అన్ని మార్గాల లక్ష్యం ఒకటే, కాని అందరూ దుఃఖాన్ని అనుభవిస్తున్నట్లు భావిస్తూనే వుంటాం. మార్గాలను మార్చి ప్రయత్నిస్తుంటాం - అలాగ కర్మ, జ్ఞాన, భక్తి మార్గాల గురించి మాట్లాడతాం. ఇవన్నీ మంచివేనంటారు భగవాన్. కాని కోరికలను మారుస్తూ పోవడం జరుగుతుంది. ఒకదాని తరువాత ఒకటి పుట్టుకొస్తూ వుండడం అసంతృప్తికి దారితీస్తూనే వుంటుంది. అది సరికాదంటారు భగవాన్.

నిరంతరం ఏదో ఒక సుఖాన్వేషణ జరుగుతూనే వుంటుంది. మనకు ఒత్తిడి కలుగుతూనే వుంటుంది కూడ. మనం ఏమీ చేయలేమని నిర్ధారణకు వస్తాం. కాని భగవాన్ మనం చేయగలిగినది వున్నాయంటారు. లక్ష్యాలు, మార్గాల గురించి మాట్లాడుతూ, ఆలోచిస్తూ పోవడానికి బదులు, ఎవరు ఈ లక్ష్యాలను సాధించాలని కోరుతున్నారో, ఎవరు ఇలా మార్గాలను అన్వేషిస్తున్నారో తెలుసుకొనడం మంచిది కాదా అంటారు. ఆనందంగా లేని వారెవరు? ఆ ఒత్తిడిని భరించే వారు ఎవరో

కనుక్కోవాలి. దానికి రెండు మార్గాలను భగవాన్ సూచించారు. ఒకటి - 'నేనెవరు' తెలుసుకొనడం. ఇతి అతి సరళం, చాలా కష్టం కూడ.

ఉదాహరణకు, మనం ప్రతిరోజూ, ప్రతి క్షణం, శ్వాస క్రియను జరుపుతూనే వుంటాం. అది అద్భుతమైనది. శ్వాస ఆడకపోతే చనిపోతారు. కాని ఈ ముఖ్యమైన క్రియ అసంకల్పితంగా మనకు తెలియకుండానే జరుగుతూ వుంటుంది. శ్వాస జరుపలేకపోయి నప్పుడే, మనకు దాని ప్రాముఖ్యత తెలుస్తుంది. ఎవరైనా మనల్ని శ్వాస క్రియను గుర్తుంచుకుంటూ జరపమంటే అది ఎంత కష్టమో అప్పుడు తెలుస్తుంది. ఎందుకంటే తెలియకుండ జరిపే కార్యం గుర్తుంచుకుంటూ చేయాలి.

## కోరుతున్న వాడెవరు?

అలాగే, యాంత్రికంగా మనం జరిపే వాటిలో మన మాట కూడ ఒకటి. నిజంగా అనుకోనివి గాకుండ మనం ఎన్నో చెబు తుంటాం. ఏమి చేస్తున్నామో మనకే తెలీదు. కోరుకుంటున్న వాడెవరో మనం కనుగొన్నప్పుడు, లేదా అసలు శ్వాస పీలుస్తున్న వాడెవరో మనం తెలుసుకున్నప్పుడు మీ ప్రవర్తనలో మార్పు తెలియ వస్తుంది. అలాంటిది జరుగుతుందని అనుభవపూర్వకంగా అర్థమవు తుంది. అసలు అన్వేషణ విజయవంతమైనప్పుడు ఒత్తిడి తగ్గుతుంది, భయమూ, దుఃఖమూ తగ్గుతాయి కూడ. ఏమీ కోర కుండ, ఆశించకుండ చేయవలసినవి చేసినప్పుడు, నేను ఒక పాత్రను నిర్వహిస్తున్నాను మాత్రమేనన్నది తెలియ వస్తుంది. నేను



ఆ పాత్రను కాను అని విశదమౌతుంది. నాటకంలో రావణుని పాత్రను నటించిన వ్యక్తి మంచి నటుడైనప్పుడు బాగా రాణిస్తాడు. కాని తాను రావణుడిని కానన్న విషయం ఆ వ్యక్తికి తెలుసు. ఆ సమయానికి మాత్రం రావణునిగా భావించి నటిస్తాడు, అంతే. ప్రేక్షకులు మాత్రం అతనిలో రావణుని చూస్తారు.

విచారణా మార్గాన్ని పాటించినగాని, సంపూర్ణ శరణాగతి ద్వారా గాని, అన్ని ఒత్తిడులను అధిగమించి, అన్ని భయాలను తొలగించు కోవచ్చునని భగవాన్ అంటారు. ప్రతి ఒక్కరూ ఒక పాత్రను ధరించవలసి వుంది. శక్తి మేర దాన్ని సక్రమంగా నిర్వర్తించి, ఏమీ ఆశించకుండ, ఫలితం ఏమైనప్పటికీ, దాన్ని స్వీకరిస్తే భయాలు, ఒత్తిడులు అన్నవి వుండవు. ఉదాహరణకు ఏదో ఒక ఉద్దేశంతో ఎవరినైనా కలవాల్సి వస్తే, ఆ సందర్భం జరిగిన తరువాత అది విజయవంతమౌతుందా, కాదా అని దాని గురించి విచారం చెందరాదు. ఆ పనిని తాను నిర్వహించవలసి వచ్చింది, నిర్వహించాను, అన్న భావనను ఏర్పరచుకుంటే వ్యక్తికి తనను గురించిన అవగాహన మరింత లోతుగా కలుగుతుంది.

'నేను ఎవరు' అన్న దాన్ని గురించి తెలుసుకునే ప్రయత్నం చేసే కొద్దీ, భయం అన్నది తగ్గుతూ పోతుంది. భయం పోతే ఒత్తిడి కూడ తగ్గుతుంది. అంతా దైవానికి వదిలిపెడితే, ఫలితం ఏమైనప్పటికీ దైవేచ్ఛగా భావిస్తాము. అలాగని నేను ఏమీ చేయను, అంటే కుదరదు. అప్పుడు ఎవరో ఒకరు ఇస్తే కాని నేను తినను అన్న అర్థం వస్తుంది. అది పాక్షిక శరణాగతి. మనకు అనుకూల

మనుకొన్నప్పుడు మనం ఒకటి చేసి, అలా కానప్పుడు నేరం దేవుని మీద తోయడం సరికాదు. నీ విధిని నీవు నిర్దేశిత సమయంలో సమర్థవంతంగా నిర్వర్తించి, ఫలితాలను ఆయనకు వదిలి పెట్టాలి.

**ప్రయత్నాల ఫలితం**

మొదటి ప్రయత్నంలో విజయం సమకూరకపోతే దేవుడు అలాగ నిర్ణయించాడని భావించాలి. శ్రీరాముడు ఒకప్పుడు అన్నట్లు, ఒక బండను పగులగొట్టడానికి పది దెబ్బలు వేస్తే, పదవ దెబ్బకు అది పగులవచ్చు. ఆ పదవ దెబ్బను గుర్తిస్తారు కాని మొదటి తొమ్మిది దెబ్బలు ఆ బండను బలహీన పరిచాయన్న సంగతిని గుర్తించరు. అలాగే, ఏదైనా సీసామూతను తెరవాలన్నప్పుడు, మనం ప్రయత్నించి యితరులకు ఇస్తే, ఆరవ వ్యక్తి ఆ మూతను తీయవచ్చు. మొదటి అయిదుగురి ప్రయత్నాల్ని మనం గుర్తించం. ఆరవ, లేదా ఏడవ వ్యక్తి ప్రయత్నం ఫలించాలన్నది దైవేచ్ఛ అయితే, మనం మాత్రం ఎన్ని ప్రయత్నాలు జరిగాయన్న వాటికే ప్రాధాన్యతను ఇస్తాం. అలాగ కాకుండ నిత్యజీవితంలో మనం అటువైపు నుండి ఆలోచిస్తే, ఒత్తిడి, భయాలు, తగ్గి, సంతోషంగా వుంటాం. అందుకే ఎన్నిసార్లు మన కోరికలను సఫలీకృతం చేసు కున్నామన్నది కాదు, అలా కోరినది ఎవరు అన్న దానిపై సంతోషం ఆధారపడి వుంటుంది.

మొత్తం ఆలోచన మన నుండి మొదలుపెట్టాల్సిన అవసరం వుంది. ఇది కష్టమనిపిస్తుంది. కాని ఈ విషయమై భగవాన్, యితర ఋషులు, మునుల నుండి విజయం గురించిన భరోసా వుంది.



అసలు అలాంటి అన్వేషణ ఎక్కడి నుండి ఉత్పన్నమైనదని ఆలోచించినప్పుడు అది దైవానుగ్రహం వల్ల జరిగిందని బోధపడుతుంది. మనం ఆ మార్గంలో పయనించాలన్నది ఆయన ఇచ్ఛ. అంటే అందులో ఆశించడమన్నది అంటూ ఏదీ వుండదు. ఎలా జరగాల్సి వుందో అలా జరుగుతుందన్నది తెలియవస్తుంది. అందుకే ప్రతిసారి మనం చేయాలనుకునేది శక్తి వంచన లేకుండ చేయాలి. అది ఉత్తమ స్థితి. భగవాన్ ప్రతి విషయంలోను అలా పాటించినది గుర్తుంచుకోవాలి. ఏదైనా ఆశించే ముందు అలా కోరుతున్నది ఎవరన్న ఆలోచనకు కొంత సమయం ఇవ్వాలి. ఆ విధంగా అంతర దృష్టితో తాత్కాలికంగానైనా సరే చూస్తే ఒత్తిడి, భయాలూ వుండవు. తద్వారా సంతోషం కలుగుతుంది.

---

**అనుస్మరణీయులు**

## శ్రీ చంద్ర ప్రభాకర్

- ఎన్. పాండురంగారావు

జూలై 1979లో డా॥ కె.ఎస్. గారు హైదరాబాదులో శ్రీరమణ కేంద్రం ఏర్పాటు చేయడం గురించి ప్రకటన ఇచ్చారు. ఆ సందర్భంలో జరిగిన హిందీ విద్యాలయంలోని మొదటి సభలో పాల్గొన్న 10-20 మంది భక్తులలో శ్రీచంద్ర ప్రభాకర్ ఒకరు. వారు ఒక సామాన్య కుటుంబానికి చెందిన హైదరాబాదు నివాసి. చిన్నతనాన్నే తల్లితండ్రులను కోల్పోయారు. ఆ పరిస్థితుల్లో పెత్తల్లి

దగ్గర పెరగడం జరిగింది. తగిన సౌకర్యాలు లభించక పోయి నప్పటికీ, చాలా కష్టపడి చదివారు.

ఒకసారి సర్ మోక్షగుండం విశ్వేశ్వర రావుగారు. ఉస్మానియా యూనివర్సిటీలోని గెస్ట్‌హౌస్‌లో విడిది చేసినప్పుడు అప్పటి వైస్ ఛాన్సెలర్ గారు శ్రీచంద్ర ప్రభాకర్ గారిని స్టూడెంట్ అటెండర్‌గా నియమించారు. 1962 సం॥ ప్రాంతంలో శ్రీ ప్రభాకర్ గారు సంగారెడ్డిలో ఉద్యోగం చేస్తుండేవారు. వారు ఏ ఆర్భాటం లేకుండ అతి సామాన్యంగా నిత్య జీవితానికి కావలసిన సౌకర్యాలతో జీవనం గడిపేవారు. అప్పుడు కలెక్టర్ 'పేషీ'లో నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్రీ ప్రభాకర్ అంటే ఆ కలెక్టర్ గారికి ఎంతో మంచి అభిప్రాయమూ, సమర్ధవంతుడైన ఉద్యోగి అన్న నమ్మకం కూడ వుండేది. రెవిన్యూ ఆఫీసర్ల పై వచ్చిన కేసులపై నిర్ణయాలు తీసుకునే సమయంలో కలెక్టర్‌గారు శ్రీ ప్రభాకర్ గారి సలహా, అభిప్రాయాలకు విలువ ఇచ్చేవారు.

శ్రీ ప్రభాకర్ చలా దయాశాలి, స్నేహ మనస్కుడు. తోటి నాయబ్ తహసీల్దార్ ఒకరు చనిపోయినప్పుడు పార్థివ దేహాన్ని స్వయంగా వారి స్వగ్రామానికి తీసుకెళ్ళారు. వారి కుటుంబ తగాదాల్లో అంత్యక్రియలు చేయడానికి ముగ్గురు తమ్ముళ్ళు కూడ నిరాకరించడంతో పూనుకుని శ్రీ చంద్రప్రభాకర్ ఆ తంతును తామే పూర్తి చేశారు. అటువంటి దయగల హృదయం వారిది.

మొట్టమొదటి నుండి శ్రీరమణకేంద్రంలో పాల్గొంటూ వచ్చిన శ్రీ ప్రభాకర్‌గారు హిందీ మహా విద్యాలయంలో వున్న కొద్ది రోజుల్లో



సత్సంగం సాయంత్రం 5 గం॥ల నుండి 6 గం॥ల వరకు జరిగేది. ఆ రోజు కార్యక్రమం ముగించిన తరువాత స్వామి రంగనాథానంద గారు నిర్వహిస్తుండిన భగవద్గీతా వ్యాఖ్యానాల కోసం రామకృష్ణ మఠానికి సైకిళ్ళ మీద మాతో కూడ వచ్చేవారు. కేంద్ర కార్యక్రమాలు యూనివర్సిటీలోని ఆంధ్ర మహిళా సభా కళాశాలకు మారిన తరువాత డా. కె.ఎస్. గారు, ప్రభాకర్‌గారిని కేంద్రానికి వైస్ ప్రెసిడెంట్‌గా నియమించారు. శ్రీచంద్రప్రకాశ్ గారితో కలిసి కేంద్రంలో ఆ రోజు జరిగిన ఆధ్యాత్మిక విషయాల గురించి చర్చించుకునే వాళ్ళం.

తిరువణ్ణామలైలో వున్నప్పుడు, నేను, చంద్రప్రకాశ్, నాగలింగం, చంద్ర ప్రభాకర్ గార్లు తరచు రాత్రిళ్ళు గిరిప్రదక్షిణ చేసేవాళ్ళం.

1980 సం॥లో శ్రీచంద్ర ప్రభాకర్ గారు ఇన్-ఛార్జ్ డిప్యూటీ కలెక్టర్ పదవీ విరమణ చేశారు. సైదాబాదులోనే కొంతకాలం పాటు ఆ తరువాత వి.ఎస్.టి. సంస్థలో పనిచేశారు. సైదాబాద్ కాలనీలో ఒక ఇల్లు కొనుక్కొని అందులో నివాసముండినారు. ఆయన ఆ ప్రక్క స్థలంలో రమణ సత్సంగానికై ఒక కట్టడం నిర్మిచాలన్న సదుద్దేశంతో దగ్గరి బంధువు ఒకరికి రూ.30,000/- ముందు వాయిదాగా ఇస్తే ఆ వ్యక్తి ఆ పని చేయకుండ మోసం చేశాడు. వారి కోరిక అలాగే మిగిలిపోయింది.

* * *

# శ్రీరమణ మహర్షి సూక్తులు

- కమలాకర వెంకటరావు

## అహంకార వినాశం

అహంకారాన్ని ఎలా వినాశమొందించడం అని ఈ వితర్కించేదీ, యోచించేదీ ఎవరో కనుక్కో. అదే అహంకారం దానిని పట్టుకో. ఇతర వితర్కాలు, యోచనలు - అన్నీ నశించిపోతాయి. అహంకార మొక్కటే విశుద్ధంగా మిగులుతుంది. ఈ అహంకారం ఎక్కడనుంచి బయలు దేరుతున్నదో చూడు. అదే శుద్ధ చైతన్యం.

## అహం బ్రహ్మాస్మి

'అహం బ్రహ్మాస్మి' - 'నేను బ్రహ్మమును' - అని చేసే సాధన ఒక భావన మాత్రమే. ఆ మాట ఎవరు అంటున్నారు? బ్రహ్మము అనదు - అనవలసిన అవసరము దానికి లేదు. 'అసలు నేను' అనదు, - అది బ్రహ్మముగా ఎప్పుడూ ఉండనే ఉంటుంది. ఇక ఆ మాట అనేది 'మాయ నేను' మాత్రమే. భావాలన్నీ 'మాయ నేను' నుండే పుట్టుతాయి. ఏ భావనా లేకుండా వుండు. భావన ఉన్నంతకాలం భయం తొలగదు.

## అహంవృత్తి - అహం స్ఫురణ

గాఢ నిద్రలో 'నే' ననేది తెలియబడదు. మేల్కొన్నప్పుడే శరీరాదులతో తాదాత్మ్యం చెంది తెలియబడుతుంది. దీనికే అహంవృత్తి అని పేరు. ఈ తాదాత్మ్యం లేకుండా కేవలాత్మగా తెలియబడినప్పుడు దానిని 'అహంస్ఫురణ' అంటారు. జాగ్రత్, స్వప్న, సుషుప్తులు మూడింటి లోను నిత్యసిద్ధమై ఉన్నప్పటికీ అది తెలియబడడం లేదు.



జాగ్రదవస్థలో వుండగానే దానిని మొదట తెలుసుకోవాలి. పిమ్మట అది మూడవస్థల్లోను అవిచ్ఛిన్నంగా వున్నట్లు తెలియబడుతుంది.

## అహంస్ఫూర్తి అనుభవం

సత్యబోధకు వేదాంతశాస్త్ర గ్రంథ పఠనమే చాలదు. సమాధి కుదరాలి. ఆలోచనలు సత్యమును మరుగుపరుస్తాయి. సమాధిలో అహంస్ఫురణ తప్ప ఇతరాలోచన లేవీ ఉండవు. అహంకార వర్జితమైన అహంస్ఫురణ ఆలోచన కాదు. అపరోక్షానుభూతి. అహంస్ఫురణ పరమార్థం బ్రహ్మమే. అహంస్ఫూర్తి అనుభవం నిశ్చలంగా ఉండి పోవడం.

## ఆత్మ అన్యవహితం

ఆత్మాన్వేషణం ఒక దూర ప్రయాణం వంటిది కాదు. ఆత్మకు నీవెంత దూరంలో ఉన్నావని? ఆత్మను నీవెన్నడూ విడచిలేవు, విడిచి ఉండడం అసాధ్యం. ఆత్మకంటె సన్నిహితమైన వస్తువు లేదు. ఆత్మను పొందడానికి నీవు ఎక్కడికీ పోనక్కర లేదు. అది నీకు అన్యవహితంగా ఉన్నదే.

## ఆత్మ - అంతర్యామి

వైష్ణవ భక్తుడు నమ్మాళ్వారు 'నా ఆత్మే నీవు' అని అన్నాడు. అంటే ఏమిటి? 'నా ఆత్మను నేను తెలుసుకోక పూర్వం నీ కొరకు బయట వెతుకుతూ తిరిగాను. కాని, నా ఆత్మను తెలుసుకొన్న తరువాత, నీవు 'నా ఆత్మవే నని తెలిసింది.' దీన్ని విశిష్టాద్వైతంతో ఎలా సరిపుచ్చడం? ఇలా వివరించుకోవాలి: 'నా ఆత్మను వ్యాపించి నీవు అంతర్యామిగా

ఉన్నావు అందుచే నేను నీ శరీరంలో ఒక భాగాన్ని. నీవు శరీర యజమానుడగు శరీరివి.'

## ఆత్మగ్రహణం

మనస్సుకూ, ఈ దృశ్య ప్రపంచానికీ అతీతమైన ఆత్మను నేననే దృఢ విశ్వాసం ముఖ్యంగా వుండాలి. మనస్సు ఎంతో ఉరకలు పెట్టుతుంటే నేమి? దాని వ్యాపారానికంతకూ అధిష్ఠానం ఆత్మయే, కనుక అది ఉరకలు పెట్టుతున్న కాలంలో కూడ ఆత్మను అందుకోడానికి ప్రయత్నించు.

## ఆత్మజ్ఞానం

ఆత్మను తెలుసుకోవడమంటే, ఆత్మగా ఉండిపోవడమే. ఏలనంటే అది తెలియబడే విషయం కాదు, తెలుసుకొనే విషయి - ఆత్మ నాకు తెలియడం లేదంటున్నావంటే నీకు అలవాటైన సాపేక్షిక జ్ఞానంతో - విషయ జ్ఞానంతో అంటున్నావు. 'నేను ఇది, అది' అని గాక, 'నేను నేను'గా ఉండి పోవడమే కావాలి.

## ఆత్మధ్యానం

'నేను బ్రహ్మమును' - అని ధ్యానం చెయ్యడం కంటే, మనస్సును అంతర్ముఖం చెయ్యడం ప్రధానం. 'నేను బ్రహ్మము' నని ధ్యానం చెయ్యవలసిన అవసర మేమున్నది? 'నేను'ను వినాశ మొందించడమే ముక్తి. కాని, అది 'నేను', 'నేను- । అనేదాన్ని ఎప్పుడూ ఏమరకుండా ఉన్నప్పుడే సాధ్యమౌతుంది. అందువల్లనే 'నేను' అనే భావాన్ని పరిశోధించవలసిన అవసరం ఏర్పడుతున్నది. 'నేను'ను వదలకుండా వుంటే సాధకుడు శూన్యస్థితిలో పడకుండా ఉంటాడు. లేనియెడల,



ధ్యానం నిద్రలోనికి దారి తీస్తుంది.

## ఆత్మప్రకాశం

చిత్తవృత్తులు లేకపోవడమంటే శూన్యస్థితి కాదు, శూన్యస్థితినైనా తెలుసుకొనే వారొకరుండాలి. తెలియడం తెలియకపోవడం, రెండూ మనస్సువే. ఆత్మ యీ రెంటికీ అతీతం, - సాక్షాత్తూ ప్రకాశ స్వరూపం.

## ఆత్మప్రేమస్వరూపం

ఆత్మ ఆనంద స్వరూపం. ప్రేమస్వరూపం. ఆత్మ ప్రేమను బట్టే సమస్తమూ ప్రియమౌతున్నది. ప్రేమ ఆత్మకంటె వేరు కాదు. విషయప్రేమ తక్కువ తరగతి ప్రేమ. ఇక ఆత్మ అనేది కేవలం ప్రేమయే. మరొక రకంగా చెప్పితే భగవంతుడు ప్రేమ స్వరూపుడు అన్నా అదే.

## ఆత్మ లక్షణాలు

ఆత్మ యెప్పుడూ సత్-చిత్-ఆనంద లక్షణములు కలిగినదే. వీనిలో మొదటి రెండూ జాగ్రత్-స్వప్న-సుషుప్తులు మూడింటిలో కూడ తెలియబడుతూ వుండగా చివరిది సుషుప్తిలో మాత్రమే తెలియబడుతుందని చెపుతారు. జాగ్రత్-స్వప్నములలో ఆ ఆత్మలక్షణం లుప్తమవుతున్నదా అని ప్రశ్న. వాస్తవానికి అది లుప్తం కావడం లేదు, సుషుప్తిలో మనస్సుండదు. ఆత్మ తానుగా ప్రకాశిస్తుంది. జాగ్రత్-స్వప్నాలలో ప్రకాశించేది ఆత్మయొక్క ఆభాస. సుషుప్తిలో మనోవృత్తి అణగిపోయిన పిమ్మట ఆనందం అనుభవానికి వస్తుంది. ఇతర సందర్భాల్లో అది ప్రియం, మోదం, ప్రమోదం అనే రూపాల్లో అభివ్యక్తమవుతుంది. కాని, అవన్నీ చిత్తవృత్తులే.

# ఆరోపణ - నిరాకరణ

(మౌంటెన్‌పాత్ (సంపుటి 54, సంచిక 2) ఏప్రిల్-జూన్ 2017లో 'అధ్యారోప ఆన్డ్ అపవాద' అనే శీర్షికతో ప్రచురింపబడిన 'కీవర్డ్' నుండి ఎన్నుకొనబడిన భాగాల అనువాదం)

**మూలం: జాన్ గ్రైమ్స్ అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి**

"వ్యక్తులు ఎప్పుడూ యథార్థంగా ఆత్మలే అయి వుండి కూడ ఆత్మైకత కోసం ప్రయత్నిస్తూ వుండడం అతిపెద్ద అద్భుతం" అని శ్రీరమణ భగవాన్ అనేవారు. సామాన్య ప్రజలు ఈ వ్యాఖ్యానాన్ని వింటే, అది ఎలా వీలవుతుంది? నేను ఇప్పటికే ఆత్మవైతే, అది నాకెందుకు తెలియదు, ఆ అనుభవం నాకెందుకు కలగడం లేదని ఆశ్చర్యపోతారు.

కేవలం ఆలోచనలకే పరిమితమై, ఆచరణాత్మకం కాని ఆధ్యాత్మికతపై శ్రీరమణులు ఆసక్తి కనబరిచేవారు కాదన్నది తెలిసిన విషయమే. జీవితంలో బంధాన్ని గురించిన చిక్కుముడికి తర్కపూర్వక, న్యాయపరమైన పరిష్కారాన్ని వ్యక్తులు ఆశిస్తారు. కాని వారు ఎప్పుడూ, ఎల్లప్పటికీ చైతన్య స్వరూపులేనన్న అవగాహన వారిలో కలిగించాలన్నదే మహర్షి యొక్క ప్రాథమిక అభిమతం. "చైతన్యమన్నది ఎప్పుడూ వుండనే వుంది. కాని దానిని శరీరంతో జోడించి భావించడం ఒక 'భ్రమ' వల్ల కలుగుతుంది" అని మహర్షి అప్పుడప్పుడు అనేవారు.

అద్వైత సిద్ధాంతంలో నిరాకారమైన ఆత్మ గురించి బోధించడానికి ఒక పద్ధతిని ఉపయోగిస్తారు. దానినే 'అధ్యారోప - అపవాద' పద్ధతి అంటారు. ఉదాహరణకు ఒక వస్తువు లేదా విషయానికి మొదట గుణ, రూపాలను ఆపాదించి, ఆ తరువాత కాదనడం. సర్వవ్యాప్తి, సర్వ సామర్థ్యము, సర్వజ్ఞత్వము, సర్వకారకము మొదలైన గుణాలను ఆపాదిస్తారు. ఆ కారణంగా వ్యక్తిలో దానిని గురించిన ఒక ప్రాథమిక అవగాహన కలుగుతుంది. ఆ తరువాత లోతుగా విషయాన్ని విశ్లేషిస్తూ అవి ఆపాదనలేనని, నిజాలు కావని నిరాకరించి చూపిస్తారు. అంటే, తెలిసిన విషయం నుండి మొదలుపెట్టి, తెలియనిదాని గురించి తెలియజెప్పడమన్న మాట. దాని అసలు ఉద్దేశ్యం సహజంగా వ్యక్తి యొక్క ఆకర్షణకు కారణమయ్యే వాటి పట్ల విముఖతను రేకెత్తించడం.

జన్మించిన వెంటనే, స్పర్శ మొదలైన జ్ఞానేంద్రియాల ప్రభావం వల్ల ఈ ప్రపంచం పట్ల ద్వైత భావాన్ని గ్రహించడం జరుగుతుంది. పుట్టుకతోనే జ్ఞానోదయాన్ని పొందిన వ్యక్తులు ఏ కొద్దిమందినో వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు. శ్రీరమణుల జీవితంలో కూడ మొదటి పదిహేను ఏళ్ళు ఇలాంటి ద్వైత భావనతోనే గడిచాయని చెప్పవచ్చు. పదహారేళ్ళ వయసప్పుడు కలిగిన జ్ఞానానుభవంతో ఆ తరువాత ఎన్నటికి తిరిగిరాని విధంగా ద్వైత భావం తుడిచిపెట్టుకు పోయింది. 'కైవల్య నవనీతం' ప్రకారం వేదాంతంలో మొత్తం మీద బంధము, విముక్తికి, వరుసగా ఆపాదన (ఆరోపణము) నిరాకరణ (అపవాదము) కారణాలు. ఉన్నదాని మీద లేని దానిని చూడడం బంధానికి కారణమైతే, దానిని తొలగించి యథార్థాన్ని గ్రహించడం ముక్తికి మార్గం.

ఆదిశంకరులు కూడ అలాగే "యథార్థం మీద అసత్యమైన దానిని ఊహించుకొనడమే బంధానికి దారితీస్తుంది" అని సెలవిచ్చారు. అడుగున వున్న నిజవస్తువును నిజంగా లేనిది కప్పి వేసినప్పుడు అసలు వస్తువు మరుగవుతుంది. రమణులు "ఉన్నది చైతన్యం ఒక్కటే. ప్రాపంచిక వస్తువులు, ఆత్మలు, పరమాత్మ ఇలాంటివి దాని మీద ఆపాదించబడినవి. యథార్థం చెప్పాలంటే, ఈ ప్రపంచం, ఆత్మ, ఈశ్వరుడు అవన్నీ ఒక అత్యుత్తమ చైతన్యం మాత్రమే" అన్నారు.

భగవాన్ అప్పుడప్పుడు ఈ ప్రపంచం గురించి సాధారణంగా ఏర్పడే ఇలాంటి భ్రమలకు కొన్ని ఉదాహరణలు తెలిపేవారు: ఒక తాడు మీద లేదా తీగమీద పాము; స్వచ్ఛము, పారదర్శకము అయిన స్ఫటికం మీద ఎర్ర రంగు; బంగారానికి నామ, రూపాలు ఇవ్వడం; ఆలిచిప్ప మీద వెండిపూత; బకెట్ నీళ్ళలో చంద్రుడు; తెరమీద చిత్రాలు. ఇక ఒక వ్యక్తి తాను అంధుడు లేదా చెవిటి వాడు అన్నప్పుడు ఆత్మకు జ్ఞానేంద్రియాలను అనుసంధానించి భావించడం అన్న మాట. అలాగే, ఎవరైన సంతోషం లేదా దుఃఖంలో వున్నానంటే, ఆత్మను మనసుతో జత చేస్తున్నట్లు. ఒకరు స్త్రీ లేదా పురుషుడిగా జన్మించాననుకుంటే, భౌతిక శరీరంతో జత చేసి భావిస్తున్నట్లు అనుకోవాలి.

ఆత్మపై ఆవరించిన ఈ ప్రపంచానికి ఒక ప్రత్యేకమైన ఉనికిని ఆపాదించడం తప్పుడు ఆలోచన అని, ఆత్మ ఒక్కటే యథార్థమూ, అసలైన చైతన్యమని, రమణుల వంటి జ్ఞానులు చెబుతారు. ఒక



తాడును పాముగా భ్రమ చెందినప్పుడు, పాము తాడును మరుగు పరిచినట్లు, ప్రపంచం ఆత్మను కప్పివేస్తుంది. ఎడారిలో ఇసుక మీద, లేదా వేడెక్కిన తారు మీద నీళ్ళు వున్నట్లు భ్రాంతిని చెందుతాము. నిజానికి, అక్కడ ఇప్పుడు, ఇంకెప్పుడు కూడ నీళ్ళు వుండవు. ఆత్మను మరుగుపరిచే ఏదైనా సరే 'నిజంగా' నిజం కాదు. శ్రీరమణుల ప్రకారం ప్రత్యక్షంగా అగుపడడమన్నది యథార్థానికి చిహ్నం కాదు. సుస్థిరంగా వుండడం, నిరాకరణకు గురి కాకుండ వుండడం, మార్పు చెందకపోవడం దాని లక్షణాలు.

వ్యక్తులు తాము ప్రత్యక్షంగా చూసే ఈ ప్రపంచాన్ని నమ్ముతారు. 'చూడడమంటే నమ్మడం' అన్నది వాడుకలో వుంది. ఏది నిజమని నమ్మబడుతుందో అది ఇక నిస్సందేహంగా, ఏ ప్రశ్నలకు తావు లేకుండ, మనసును ప్రవేశించే హక్కును పొందుతుంది. ఒకసారి ఏ వస్తువునైన నిజమని నమ్మిన తరువాత దాని యథార్థత్వాన్ని కాదని తలవడం పూర్తిగా అసాధ్యం. ఈ ప్రపంచం నిజమైనదని వ్యక్తి నమ్మడం వల్ల, ఆ అపనమ్మకం చెరిగి పోయేవరకు, ఆత్మను అనుభూతిలోనికి తెచ్చుకొనడం కూడ అసాధ్యం. ఈ అపనమ్మకమే ఆత్మ మరుగున పడడానికి కారణమౌతోంది.

లోతుగా ఆలోచించకుండ పైపైన గమనిస్తే, మరొక వస్తువు లేదా భావన చేత ఆత్మ మరుగునపడుతుందన్నది పూర్తిగా ఒక వ్యతిరేక (ఋణాత్మకమైన) దృగ్విషయముగా అనిపిస్తుంది. కాని రమణ మహర్షి ఈ అంశంపై మరో విధంగా వ్యాఖ్యానించారు.

ఆయన "ఈ 'తిరోధానం' (ముసుగున మరుగున పడడమన్నది) జీవులను తమ పూర్వజన్మల లోని సంఘటనలను మరిపింప జేయడానికి ఈశ్వరుడు ఎంతో కరుణతో కల్పించిన విధానము. అలాంటి జ్ఞాపకాలు సమసిపోకుండ వుంటే, వ్యక్తులు పరిణతి చెందిన స్థితికి చేరలేరు. జీవితాలు చిందరవందరై, ధ్వంసమై పోతాయి" అన్నారు. అపుడు వాళ్ళకు పూర్వజన్మలలో తాము ఇతరులపై విధించిన బాధలు, తమపై ఇతరులు విధించిన బాధలు అన్నీ తెరమీదికి వస్తాయి. అటువంటి స్థితిలో వాళ్ళకు జీవితం దుర్భరమవుతుంది. అది ఊహించుకుంటేనే భయం పుడుతుంది. అసలు ఈ జన్మలోని ఏ కొద్ది విషయాలో అంతంత మాత్రంగా జ్ఞప్తికి వస్తేనే అల్లాడిపోతాము. అన్నీ మన మంచికేనన్న భగవాన్ యొక్క మామూలు వాదనకు ఇది సరిపోతుంది కదా! ఒకసారి కాదు 'అధ్యారోప', 'అపవాద' (ఆరోపణ, నిరాకరణ) లను గురించి విశదీకరిస్తున్నప్పుడు మొదటి పదం వ్యక్తిని ఆత్మ వైపుకు మళ్ళిస్తుందని, ఆ తరువాతది ప్రపంచం ఆత్మనుండి భేదమైనది కాదని తెలుపుతుందని అన్నారు.

అద్వైతవాదుల ప్రకారం 'మాయ' అన్న దానికి రెండు అంశాలు లేదా రెండు శక్తులు వుంటాయి: మొదటిది (ఆవరణ) ఒక దానిని దృష్టికి అందకుండ మరుగుపరచడం. రెండవది (విక్షేప) మరొక దానిని దృష్టిలోనికి తేవడం. ఆత్మను కప్పినట్లు భ్రాంతిని కలిగించి, ఇక ప్రపంచాన్ని దృగ్గోచరం లోనికి తేవడం, అంటే యథార్థమైన దానిపై అసత్యము, నిత్యము కాని దానిని అగుపడేలా చేయడం.



అసలు అలా దాచడమే హర్షించదగినది కాదు, మీదు మిక్కిలి, అసత్యాన్ని ఎత్తి చూపడం నీచమైనది.ఈ 'ప్రక్రియ'ను గురించి రెండు రకాలుగా రమణులు వ్యాఖ్యానించారు. ఒకటి షరతులతో కూడినది, మరొకటి షరతులు లేనిది. తాడు మీద పాము అగుపడడం షరతులు లేనిది, ఎందుకంటే ఒకసారి తాడు అన్నది ఎఱుకలోనికి వచ్చిన తరువాత 'భ్రమ' కలిగించిన పాము కనుమరుగవుతుంది. ఇక షరతులతో కూడిన దానికి ఉదాహరణ, ఎండమావి. ఎందుకంటే, అది ఎండమావి అని తెలిసిన తరువాత కూడ అందులో నీళ్ళు మాయం కావు.

తాడుస్థానంలో పాము ఉన్నట్లు తోచే భ్రమ తాడును ఎప్పుడూ చూడనివానికి కలగదు. దానిని ముందు చూసిన వానికే కలుగుతుంది. ఆలిచిప్ప మీద పామువున్నట్లు, లేదా వెండిపూత తాడు మీద వున్నట్లు ఆ భ్రమ కలుగదు.

తాడుకు బదులు పాము వున్నట్లు భ్రమ పడిన వ్యక్తికి తాడు కనిపించదు. ఆలిచిప్ప మీద వెండిపూత వున్నట్లు తోచిన వానికి, ఆలిచిప్ప కనిపించదు. అలాగే, ఈ ప్రపంచం యథార్థమని నమ్మిన వ్యక్తి ఆత్మను గుర్తించలేదు. అందుకే ఆత్మాన్వేషణ అవసరం.

* * *

# శ్రీ భగవాన్ సేవలో

- జి. శ్రీహరిరావు

## 12. 'మన్నీ' మామ్మ

నాకు గుర్తున్నంత వరకూ, ఈ సంఘటన 1945లో జరిగింది. శ్రీభగవాన్ పాతహాలులో కూర్చున్నారు. ఎప్పటిలాగానే చాలామంది భక్తులు వచ్చి శ్రీభగవాన్‌కు ప్రణమిల్లుచున్నారు. హాలు భక్తులతో కిక్కిరిసి వుంది. నేను శ్రీభగవాన్ పక్కనే నిలబడి వున్నాను. శ్రీభగవాన్ ఉన్నట్లుండి నావైపుకు తిరిగి, హాలులో కూర్చున్న ఒకరిని చూపుతూ, "వెంకిటూ! ఆ మూలకు చూడు. వదిన వచ్చారు. వారిని జాగ్రత్తగా చూసుకో" అన్నారు.

అవును. శ్రీభగవాన్ అన్నగారైన నాగస్వామిగారి భార్య జానకీ అమ్మాళ్ సనాతనాచారం ప్రకారం, బ్రాహ్మణ వితంతువులా తలమీద కొంగు కప్పుకొని, ఒక మూల కూర్చొని వున్నారు. చాలా చిన్న వయస్సు లోనే గతించిన నాగస్వామిగారి మరణం తర్వాత, ఆ బాల్య వితంతువు తన తల్లితండ్రుల వద్ద జీవించసాగింది. తర్వాత, తన సోదరి కుమారుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఈశ్వరన్ వద్ద పన్రుటిలో జీవనం కొనసాగించారు. శ్రీభగవాన్ దర్శనార్థం చాలా అరుదుగా తిరువణ్ణామలై వచ్చేవారు. చాలాకాలం తర్వాత మళ్ళీ ఇపుడు వచ్చారు. అంతమంది జనంలో, ఇంతకాలం తర్వాత, ఆమెను శ్రీభగవాన్ అంత సులభంగా ఎలా గుర్తించగలిగారు అని నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. వారి ఆదేశానుసారం, ఆమె దగ్గరకు వెళ్ళి, శ్రీభగవాన్ సూచన తెలియపరిచాను. తిరువణ్ణామలై వచ్చి మా దగ్గరే వుంటానని ఆమె మాట ఇచ్చారు. అలాగే వచ్చారు కూడా. ఇంట్లో అందరూ, ఆమెను



ఎంతో ప్రేమతో, గౌరవంతో 'మన్నీ మామ్మ' అని పిలిచేవారు. 'మన్నీ మామ్మ' కూడా మా అందరిమీదా వాత్సల్యం కురిపిస్తూ, ఎంతో ప్రశాంతంగా జీవితం గడిపేవారు. 1966 మే 18వ తారీఖున ఆమె కాలం చేసారు.

## 13. అన్నగారు - శ్రీరమణులు

నాకు మేనత్త అయిన అలమేల్‌గారు ఆశ్రమవాసులందరికి 'అత్తగా' ఆప్యాయత సంపాదించుకున్నారు. ఆమె శ్రీభగవాన్‌కున్న ఒక్కగానొక్క చెల్లెలు. ఆమె అంటే శ్రీభగవాన్‌కు ఎంతో ప్రేమ. శ్రీభగవాన్ జీవిత కథలన్నిట్లోనూ వారికి తన చెల్లెలు అంటే ఎంత ప్రేమో వ్యక్తపరచబడ్డాయి. చివరివరకూ, ఆమెపట్ల శ్రీభగవాన్ అదే ప్రేమ కురిపించారు.

తమిళంలో ఆశ్రమ ప్రచురణ కొత్తది వెలువడినపుడల్లా శ్రీభగవాన్ మొదటి పేజీమీద 'అలమేలు' పేరు ముత్యాలవంటి తన స్వదస్తూరీతో వ్రాసి వుంచి, తర్వాత పాతహాలులో భక్తుల సముదాయంలో ఆమె కూర్చున్నపుడు పిలిచి, ప్రేమగా ఆ పుస్తకాన్ని ఆమెకు ఇచ్చేవారు. శ్రీభగవాన్‌తో అలమేలు పేరు వ్రాసి పెట్టి వున్న అనేక పుస్తకాలు నా దగ్గర ఇపుడూ వున్నాయి.

ముద్రణకు ముందు, ప్రెస్సువారు ఇచ్చే ఆఖరి ప్రూఫు కాపీ శ్రీభగవాన్ ఎపుడూ తన దగ్గర దాచిపెట్టి, స్వహస్తాలతో పేజీలవారీగా దానిని కుట్టి బైండు చేసి వుంచేవారు. ఎపుడైనా కొత్త పుస్తకాల సంఖ్య పరిమితమైనపుడు, ఆశ్రమం ఆఫీసులోనే అవన్నీ అయిపోయేవి. అలాంటపుడు కూడా శ్రీభగవాన్ అలమేలు అత్తను పుస్తకం తీసుకెళ్ళ మని పిలిచేవారు. పుస్తకాలే లేనపుడు శ్రీభగవాన్ ఎలా ఇవ్వగలరని

నేనూ, ఇతరులూ ఆశ్చర్యపడేవాళ్ళం. ఆయన చక్కగా బైండు చేసిన ఆ ప్రూఫు పుస్తకాన్ని అత్తకు ఇచ్చేవారు. శ్రీభగవాన్ కరుణాప్రవాహాన్ని ఏదీ ఆపగలిగేది కాదు.

మా మామయ్య పిచ్చు అయ్యర్‌గారి షష్ఠిపూర్తి ఉత్సవం 6-3-1947న, ఆశ్రమంలోనే నిర్వహింపబడింది. ఒక బంగారు జరీతో నేయబడిన చీరను అత్తకు బహూకరించడానికి బరోడా మహారాణి స్వయంగా వచ్చారు. అది ఆరు గజాల టిష్యూ చీర, అలమేలత్త సంప్రదాయపరంగా తొమ్మిది గజాల చీరలు కట్టుకునేవారు.

రాణీగారు ఇచ్చిన చీర కట్టుకోవాలని శ్రీభగవాన్ కోరిక మరియు ఆజ్ఞ. సంప్రదాయానికి విరుద్ధమైన చీర కట్టుకోవడం అలవాటు లేని అత్తకు ఎటూ పాలుపోలేదు. ఈ విషయం శ్రీభగవాన్ దృష్టికి తీసుకు వెళ్ళారు. శ్రీభగవాన్ తన చెల్లెలి దగ్గరకు వెళ్ళి, 'అలమేలూ! ఆమె తెచ్చిన చీర నువ్వు కట్టుకోవాలని రాణీగారి కోరిక. నువ్వు కట్టుకునే మామూలు చీరమీద ఇది కట్టుకోవచ్చు కదా!'' అన్నారు. క్లిష్టమైన ఆమె సమస్యకు ఎంత సులభమైన పరిష్కారం.

ఘనమైన ఆ చీర కట్టుకుని, తనకు నమస్కరించడానికి వచ్చిన అత్తను, ''ముందు అమ్మకు నమస్కరించి నా దగ్గరకు రా'' అన్నారు శ్రీభగవాన్. మాతృభూతేశ్వరాలయంలో నమస్కరించి రావాలని శ్రీభగవాన్ ఆదేశం. ఆ సందర్భంలో వాడడానికి ఎంతో అందమైన గులాబీ దండలు తీసుకువచ్చారు. ఆ రోజుల్లో తిరువణ్ణామలైలో గులాబీ దండలు సులభంగా దొరికేవి కాదు. శ్రీభగవాన్‌కు అర్పించ కుండా, తానూ, మామా ఆ దండలు ధరించడం అత్తకు సబబు అనిపించలేదు. ఒక దండ శ్రీభగవాన్ దగ్గరకు తీసుకు వెళ్ళారు. శ్రీభగవాన్, మళ్ళీ ఎంతో ప్రేమతో, ''అమ్మకు వెయ్యరాదా?'' అన్నారు.



తమ తల్లిపట్ల, చెల్లెలు పట్ల శ్రీభగవాన్‌కు ఎంత ప్రేమో! (అమ్మ సమాధికి మాల అర్పించడం, శ్రీభగవాన్‌కు అర్పించడం కాదా!)

మామ పిచ్చు అయ్యర్ మంచి భోజనప్రియులు. ఆ మాటకొస్తే తిండిపోతు కూడా! ఆయన చాలా దృఢకాయులు. దుస్తుల పట్ల, దేహ శుభ్రత పట్ల ఆయన శ్రద్ధ చూపేవారు కాదు. భోజనశాలకు, ఉతకని దుస్తులు ధరించి వచ్చి, ఆవురావుమని భోజనం చేసేవారు. భోజనమయ్యాక, వంటశాలకు వెళ్ళి కొన్ని వడలు తీసుకొని, తన మురికి టవల్లో కట్టుకొని వెళ్ళిపోయేవారు. ఎంతో క్రమశిక్షణకు అలవాటు పడిన శ్రీనిరంజనానందస్వామికి ఇదంతా నచ్చేది కాదు. వంటశాలలో భోజన పదార్థాలను తాళం వేసి వుంచి, మామకు అందుబాటులో లేకుండా చేసారు. పిచ్చు అయ్యర్‌కు అందుబాటులో తినుబండారాలు లేకుండా వుంచాలని వంటశాలలో వున్న ఆడవాళ్ళను ఆదేశించారు.

ఒక పెద్దామె మాత్రం, ఈ విషయం శ్రీభగవాన్‌కు సూచన ప్రాయంగా తెలిపింది. ఆ తర్వాత, శ్రీనిరంజనానందస్వామి తన సమక్షంలో వున్నపుడు, ''పిచ్చు అయ్యర్ ఎవరో తెలుసా? మన బావగారు, మన చెల్లెలి భర్త. ఆయనకు ఇక్కడ సమానమైన అధికారాలు వున్నాయి'' అని మందలించారు. ఆ విధంగా, ఆ మహా ఋషి కుటుంబ మర్యాదల గురించి తన సోదరునికి ఆదేశపూర్వకంగా తెలియపరిచారు.

శ్రీభగవాన్ ఆదరణ సంపాదించిన మామ పిచ్చు అయ్యర్, మూర్తీభవించిన ప్రేమ, కరుణా సముద్రులు. రెండేళ్ళ వయస్సులో తల్లిలేని నన్ను మా తండ్రిగారు అత్త దగ్గర వదలి వెళ్ళినప్పటి నుండే,

నన్ను ఎంతో గారాబంగా పెంచి పెద్ద చేసినాయన మామ పిచ్చు అయ్యర్. అంతే కాదు. మా ఏడుగురు పిల్లలూ ఈ అత్తామామల వాత్సల్యం, ప్రేమలతో పెరిగినవారే! శ్రీభగవాన్‌కు మహాభక్తుడైన ఆయన 1973 మే 4వ తారీఖున తన స్వామిలో లీనమైపోయారు.

## 14. ఆదర్శపత్ని - నాగలక్ష్మి

1938లో మా కుటుంబం తిరువణ్ణామలైకు మారిపోయి, ఆశ్రమంలో నివసించడం మొదలుపెట్టే సమయానికి నా భార్య నాగలక్ష్మి వయస్సు ఇరవైమూడేళ్ళు. తన 68వ ఏట, 1984లో ఆమె కాలం చేసింది. చివరి వరకూ ఆమె ఇంటి పనులూ, దేవతార్చనలన్నీ చూసుకోవడమేగాక, ఆశ్రమంలో జరిగే పూజా కార్యక్రమాలన్నిటిలోనూ, ఎంతో భక్తిశ్రద్ధలతో పాల్గొనేది. తరచుగా గిరిప్రదక్షిణ చేసేది. 1983లో ఆమెకు తీవ్రమైన ఉబ్బస వ్యాధి సంక్రమించినప్పటికీ, ప్రదక్షిణల అలవాటు మానుకోలేదు.

ఎవరెన్ని తప్పులు చేసినా, నాగూ ఎంతో ఓపికతో సహించేది. 1953 దాకా సర్వాధికారి కోడలిగానూ, ఆ తర్వాత ఆశ్రమ ట్రస్టీ బోర్డు ప్రెసిడెంటుగారి భార్యగా వున్న ఆమె, ఏనాడూ తన హోదాను ప్రదర్శించడం చేసేది కాదు. ఆశ్రమాన్ని సందర్శించడానికి వచ్చిన స్త్రీలతో ఆమె ఎంతో సహజంగానూ, తేలికగానూ కలిసిపోయేది. ఆశ్రమంలోగానీ, ఇంట్లోగానీ తెరచాటు జీవనం సాగించడంలో ఆమె శ్రీభగవాన్ బోధను పూర్తిగా పాటించేది. చిన్న వయస్సులో ప్రేమమూర్తి అయిన ఒక సోదరిగానూ, తదుపరి సంవత్సరాలలో శాంతమూర్తి అయిన ఒక తల్లిగానూ ఆమె ఆశ్రమంలో అనేకమందికి బాసటగా నిలిచింది.



ఆ రోజుల్లో నా సమయమూ, శక్తీ అంతా ఆశ్రమ పనులకే వినియోగించవలసి వచ్చేది. ఆశ్రమంపై కోర్టు కేసులు వచ్చాయి. ఇవిగాక ఆశ్రమ నిర్వహణకు సంబంధించిన అనేక జటిలమైన సమస్యలను ఎదర్కోవలసి వచ్చేది. పెక్కుమంది న్యాయవాదులను ఆశ్రయించటమేగాక, చిన్న న్యాయస్థానాలు మొదలుకొని మద్రాసు ఉన్నత న్యాయస్థానం వరకు కిందకూ పైకీ పరుగులు పెట్టవలసిన పరిస్థితి. ఒక ఖద్దరు సంచిలో కేసులకు సంబంధించిన కాగితాలను పెట్టుకుని తిరిగేవాడిని. ఇది చాలదన్నట్లు ఆశ్రమ ప్రాంగణంలోనే అనేక కీచులాటలు. వీటన్నిటినీ అధిగమించి ఆశ్రమ పురోగతికోసం అవిరామంగా, అహర్నిశలూ శ్రీభగవాన్ కరుణే ఆధారభూతంగా కృషి చేయవలసిన సమయం అది. ఈ పనులలో మునిగిపోవడం వలన మొదటి నుంచీ శ్రీభగవాన్ బోధించిన ఆత్మవిచారణ మార్గంలో పూర్తి శ్రద్ధతో సాధన చేయడానికి నాకు సమయం చిక్కేది కాదు. 'అక్షరమణ మాల'లో ఒక్క అక్షరం కూడా ఆశ్రమ అధ్యక్షుడు వెంకిటూకు రాదని నా స్నేహితులు వెక్కిరించేవారు. నేను వారితో పూర్తిగా ఏకీభవించే వాడిని. నా భార్య నాగూ మాత్రం ఎంతో చాకచక్యంతో ఇటు పెద్ద కుటుంబానికి సంబంధించిన ఇంటి పనులూ, అటు శ్రీభగవాన్ బోధనను అనుసరించిన ఆధ్యాత్మిక సాధన చక్కగా చేసుకొనేది. శ్రీభగవాన్ కృత తమిళ రచనలూ, శ్రీభగవాన్‌ను స్తుతించే పాటలన్నీ ఆమెకు కంఠస్థంగా వచ్చాయి. శ్రీమురుగనార్, సాధు ఓం, సత్య మంగళం వెంకటరామయ్యర్, రామనాథ బ్రహ్మచారి, ఇంకా ఇతరులూ రచించినవాటిని ఖంగుమనే స్వరంతో వాటన్నిటినీ పాడుతుండేది.

నాగూ ఆతిథ్యం అనితరసాధ్యం. ఎవరైనా అతిథి వచ్చారంటే ఆమె ముఖం వెలిగిపోయేది. బిచ్చగాళ్ళు ఎవ్వరు వచ్చినా ఆమె వారిని

వట్టి చేతులతో పంపేది కాదు. దీని వెనుక ఒక కథ వుంది. భిక్ష ఇవ్వడం గురించి, శ్రీభగవాన్ ఒకసారి యథాలాపంగా చెప్పిన మాట ఆమెను ఎంతో ప్రభావితం చేసింది. దీనిని గురించి నాగూ మా అబ్బాయి గణేశన్‌కు చెప్పింది. ఒకానొక సమయంలో, ఆశ్రమంలో వున్న వితంతువులు శ్రీభగవాన్ ఆసీనులై వుండే పాతహాలుకు వెళ్ళేవారు కాదు. ఆశ్రమ వంటశాలలో ఏదో సేవ చేస్తుండేవారు. వారిపై వున్న కరుణ వలనగాని లేక ఇతర కారణాల వలనగాని శ్రీభగవాన్ తరచు వంటశాలకు వెళ్ళి వారితో ఆ కబుర్లూ, ఈ కబుర్లు చెబుతూ, ఎంతో సరళమైన శైలిలో ఏదో ఉపదేశం ఇచ్చేవారు. ఒకసారి, నాగూ వంటశాలలో వున్నపుడు శ్రీభగవాన్ చేసిన ఉపదేశం ఆమె జీవితాంతం హృదయంలో నాటుకుపోయింది. శ్రీభగవాన్ వంటశాలలో ఎవరితోనో ఇలా అన్నారట!, "ఎవరైనా భిక్షకు వస్తే ఏదో ఒకటి ఇచ్చి పంపండి. చివరికి ఒక ఉసిరికాయ అయినా సరే! ఎవరు ఏ రూపంలో వస్తున్నారో ఎవరికి తెలుసు?"

ఉత్కృష్టమైన బోధనలను శ్రీరమణులు ఎంతో సరళమైన, ఉపదేశపూర్వక భాషలో విశదీకరించేవారు. ఒక్కొక్కసారి జ్ఞానులూ, మహానుభావులూ సామాన్య భిక్షువు రూపంలో దర్శనమిస్తారని ఈ సందర్భంలో శ్రీభగవాన్ భక్తులకు సూచించారు.

కేవలం బాహ్యరూపాలను ఆధారం చేసుకొని మనుష్యులపై నిర్ణయాలు తీసుకొనరాదని బోధన. ఇది నాగూ మనస్సులో హత్తుకు పోయింది. 1974లో నా షష్టిపూర్తి ఉత్సవమును మా ఏడుగురు పిల్లలూ, బంధువులూ, స్నేహితులూ, ఇతర శ్రేయోభిలాషులూ ఎంతో ఘనంగా జరిపారు. నేను రెండవసారి నా జీవిత భాగస్వామిని, ఆదర్శపత్ని ఆయన నాగు మెడలో తాళికట్టి, ఆమెను పాణిగ్రహణం



చేసాను. ఇద్దరం, మాతృభూతేశ్వరాలయంలో అమ్మ ఆశీస్సులూ, శ్రీభగవాన్ సమాధి వద్ద ఆ బ్రహ్మజ్ఞాని ప్రసరింపజేసే శక్తిపూరితమైన కరుణా ప్రవాహం నిశ్శబ్దంగా అనుభవైక్యం చేసుకున్నాం. ఆపాదమస్త కమూ తన్మయులమయ్యాం. 1984 మొదలయ్యిందో లేదో, నాగూకు ఉబ్బసం బాగా ముదిరి పోయింది. ఆమె మంచం పాలయ్యింది. బాగా చిక్కిపోయి, చాలా బాధపడింది. ఆ పరిస్థితిలో కూడా, శ్రీభగవాన్ స్మృతిలోకి రాగానే, ఆమె మనస్సంతా శాంతితో నిండిపోయి, ముఖం ఆనందంతో వెలిగి పోయేది. ఒకసారి ముఖం అంతా ఆందోళనతో నిండిపోయి ఆమె ప్రక్కనే కూర్చున్న గణేశన్‌తో ఇలా చెప్పింది. "నాయనా! దేహానికి జబ్బు చేయడం సహజం. భౌతికంగా మనం బాధపడవచ్చు. వాటి గురించి ఆలోచించడం మానేయి. ఎల్లపుడూ శ్రీభగవాన్ గురించే ఆలోచనలు మళ్ళించు. వారిని నిరంతరం ప్రార్థించుకో. ఆయన భక్తులకు సేవ చేయి. శ్రీభగవాన్ తమ కరుణను మీ అందరిపై ప్రసరింపచేస్తారు. నీ తల్లిగా నేను కేవలం నీకు దేహం మాత్రం ఇచ్చాను. నీ అసలు తల్లి శ్రీభగవాన్ అని తెలుసుకో."

ఆ రోజు 1984 మార్చి 3వ తారీఖు. దిగజారిపోతున్న నాగూ చుట్టూ మా పిల్లలంతా కూర్చున్నారు. గుండెలు బరువెక్కి కళ్ళనిండా నీళ్ళు నింపుకొని వున్నారు. నాగూ కళ్ళు నా కోసం వెతుక్కుంటున్నాయి. అది గ్రహించిన గణేశన్ పరుగున నా దగ్గరకు వచ్చి నన్ను తీసుకెళ్ళాడు. 55 సంవత్సరాల నా సహధర్మచారిణి వద్దకు నేను వెళ్ళగానే, అసాధారణమైన తీయదనంతో నావైపు చూసి ముఖమంతా తృప్తి నింపు కొని, తన ఆఖరి శ్వాస తీసుకొన్నది. శ్రీభగవాన్‌లో లీనమైపోవడానికి నాగూ తన దేహాన్ని త్యజించివేసింది. నా వ్యక్తిగత జీవితంలో ఈ విధంగా ఒక అధ్యాయం ముగిసింది. *(సశేషం)*

## Bhakti and Detachment

Dr.K.Subrahmanian (Talk 2)

*Nashta manasa utkrsta yoginah*

*krtya mastikim svasthitim yatah*

*Nashtamanasautkrstayoginah*: who is *shreshta manasa*? It is the yogis who are really extraordinary. *Nashta manasa:* they don't have the kind of mind that we have. They are free from ego of any kind. There is no *ahankara and* no *mamakara.*

*Udara charitanamtu vasudhaiva kutumbhakam*

*Udara charitanam:*They don't say, "This is mine; this is yours."

*Vasudhaiva kutumbakam:* They consider the entire universe as their family.

*Krtya mastikim svasthitim yatah:* What is there for them to do? *Svasthitim yatah:* They are always in the self. They are always thinking of God. To think of God all the time means thinking of him twenty four hours. That is possible if we surrender to him totally. *Sarvadharmaan parityajyamaam ekam saranamvrja*: They have surrendered themselves to the Supreme Being. They have no *sankalpa* of their own. It does not mean that if you don't have any *sankalpa* of your own, you will get power, position, lots of money and that you will be very wealthy. It means that whatever might happen to you, you will not worry.

Janaka was a king, but his wealth and his power never affected him. He carried out his responsibilities as a king



because it was his duty. Janaka used to go to his guru for instructions every day. He wanted to study the Vedas and the Upanishads. The guru had some other disciples also. If the other disciples did not come on time, Janaka's guru would begin (the lessons). If Janaka was late, the guru would wait for him. Some of the *sishyas* told the guru, "You don't wait for us if we're late. Why you are waiting for him? Is it because he is the king? You seem to have respect for his position." The guru said, "It is not like that. I don't want to answer your question now. At the appropriate time you will get the answer."

